# అమ్మ

'నక్కను తొక్కి వచ్చాడు' అంటారు గోపాలం గురించి బాగా తెలిసినవాళ్లు. వాళ్ల మాటల్లోని వ్యంగ్యం కొందరికే తెలుస్తుంది.

'దత్తుడుగారా, ఆయనేకేం మహరాజు' అంటారు గోపాలం గురించి బాగా తెలియని వాళ్లు కూడా.

దత్తుడుగారని విన్నప్పుడల్లా గోపాలం హతాశుడవుతాడు. ఊరూ పేరూ లేనివాణ్ణా నేను, కన్నవారేమో గురునాథం అని పేరు పెట్టారు, పెంపుడు తల్లి సీతమ్మగారేమో గోపాలం అని నామకరణం చేశారు, అది ఆవిడ భర్తపేరు ఇన్ని పేర్లుంటే దత్తుడుగారట దత్తుడుగారు అని విసుక్కునేవాడు. లోకం తనను ఎగతాళి చేస్తున్నదనుకునే వాడు. అందుకే ఆ పేరు వింటేనే అతని ఒంటి మీద తేళ్లూ, జెర్రులూ పాకినట్టు అనిపించేది, లోకాన్ని అసహ్యించుకునేవాడు.

వస్తుతః గోపాలం మంచివాడు. నోట్లో నాలుక లేనివాడు. ఎవరేం చెబితే అదే నిజమనుకునే స్వభావం అతనిది. అంత బోళామనిషి.

బాబూ, లోకులు కాకులు, అందరి మాటలు నమ్మకు అని అప్పుడప్పుడు హితబోధ చేసేది సీతమ్మగారు. భర్తమీది ఆదరభావం కొద్దీ ఆయన పేరు పెట్టినా, పేరు పెట్టి భర్తను పిలవడం భావ్యం కాదనుకుని ఆవిడ కొడుకుని 'బాబూ' అని ప్రేమగా పిలిచేది. కాని కొడుకులా, దత్తుడుగారూ అని విన్నప్పుడు మాత్రం విసుక్కునేది లోలోపల మహా బాధపడేది. పాపం ఖర్మకాకపోతే, పరాయివాళ్ళ బిడ్డను దత్తు తెచ్చుకోవడమేమిటి అనుకునేది. భర్తపోయిన తర్వాత తనకు మంగదిక్కు కరవయింది. పదహారు ఎకరాల మాగాణి సుక్షేత్రాన్ని తాను స్వయంగా

చూచులేకపోయింది. తమ పెద్దలు కష్టపడి సంపాదించి యిచ్చి పోయిన బంగారంలాంటి భూమిని అమ్ముకు ఏ పట్టణం చేరడమో, ఎవరికైనా కవులుకిచ్చి కూర్చోవడమో ఆవిడకి పాపకార్యంగా కనపించింది. తన భర్తపేరు చెరిగిపోవడం, సొంత వ్యవసాయాన్ని మానడం ఆమెకు యిష్టం లేదు. మొదటి నుంచీ కష్టజీవి. చేతికి నరం లేకుండా పాలేళ్లకు పెట్టింది. కనుకనే సొంత వ్యవసాయాన్ని మానుకోలేక కొడుకుని పెంచుకుంది.

సీతమ్మగారు గొడ్రాలు గాదు! ఒక మగపిల్లవాడు ఒక ఆడపిల్ల కలిగారు. పుట్టినయిద్దరూ కొంతకాలం జీవించారు. స్నానానికని వెళ్లిన వాళ్లిద్దరూ ఏట్లో కొట్టుకు పోయారు. ఒకే సమయంలో ఆ దుఃఖాన్ని ఎలాగో భరించింది. అందువల్ల ఇతరులు తన కొడుకుని దత్తుడుగారూ అని పిలిచినప్పుడల్లా ఆవిడ బాధ పడింది.

ఒక రోజు మధ్యాహ్నం వరండాలో కూర్చుని గోపాలం ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అది చూసింది సీతమ్మగారు. చెప్పుడు మాటలు విని కొడుకు తన మీది అభిమానాన్ని చంపుకుంటాడేమో అని ఆవిడ భయం. ఆ భయంతో వాళ్ల మాటల్ని చాటున నుంచుని వినసాగింది.

'మీ అన్నయ్యా వట్టి చవటలా తయారయ్యాడంటే నమ్ము. మీ వదిన ఎంత చెపితే అంత...'

'మా వదిన మంచిదేనే'

'మొదట్లో మంచిదే, రోజులు గడవను గడవను మీ అన్నయ్యను బుట్టలో వేసుకుంది, అత్తగారిని చులకనగా చూడడం మొదలు పెట్టింది...'

'ఇప్పుడెలా వుంది మా అమ్మ?' ఆదుర్దాగా అడిగాడు గోపాలం.

'కొడుకూ కోడలు మధ్య నలిగిపోతోందని విన్నాను. నువ్వేమో యిలా వచ్చేశావు...'

'ఇలా జరుగుతుందని తెలిస్తే, నేనసలు దత్తతకు ఒప్పుకునేవాణ్ణి కాను.'

మరికొంతసేపటికి 'అమ్మా' అంటూ గోపాలం లోపలికి వచ్చాడు. అతని వెనకాల యిందాక వచ్చిన మిత్రుడూ వున్నాడు.

'వీడు నా చిన్ననాటి స్నేహితుడు. మే మిద్దరం ఒకే స్కూల్లో చదువుకున్నాం. ఇప్పుడు వీడు హైదరాబాద్‌లో పెద్ద కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

'చాలా సంతోషం బాబూ, రాత్రికి మాయింట్లోనే భోజనం చేసి వెళ్లాలి..'

'మా అమ్మ చేతి వంట తిన్న తర్వాత, రెండు మూడు రోజులుండి వెడతానంటావు, చూడు.'

'అది నా మీద వాడికున్న అభిమానం.'

'మా అమ్మ నిజంగానే వంట అద్భుతంగా చేస్తుంది...'

'మరి మీ అమ్మకు ఎప్పుడిప్పిస్తావు రెస్టు?' నవ్వుతూ అడిగాడు మిత్రుడు.

'అలా అడుగుబాబూ, ఎంత చెప్పినా నామాట లెక్కచెయ్యడు. వాడి వయస్సు వాళ్లంతా పెళ్లి చేసుకున్నారు.'

'ఎవరొచ్చినా మా అమ్మ యీ సంగతి తప్ప మరోటి మాట్లాడదు...'

గోపాలం యింకా ఏదో చెప్పబోయాడు. కానీ సీతమ్మగారు లోపల్నుంచి తెచ్చిన ఫలహారపు పళ్లాలవల్ల అంతరాయం కలిగింది.

ఆ మరునాడు మిత్రుడు వెళ్లిపోయాడు.

గోపాలం ముఖం చూస్తే ఏదో ఆలోచిస్తున్నవాడిలా కనిపించాడు. సీతమ్మగారూ అలాగే కనిపించింది.

ఒకరోజు ఉదయం గోపాలం టిఫిన్ చేస్తుంటే తల్లి అడిగింది. 'ఏం బాబూ, ఒంట్లో కులాసాగా లేదా??'

'బాగానే వున్నాను'

'లేదు బాబూ, నా దగ్గర చెప్పడానికి దాస్తున్నావు. మూడు నాలుగు పెసరట్లు తినేవాడివి. ఈ పూట ఒక్కటే చాలన్నావు...'

'ఏంలేదు'

'చూడు బాబూ, నాతో చెప్పకపోతే యింకెవరితో చెపుతావు? నువ్వు చెప్పకపోతే మీ బాధ నాకేం తెలుస్తుంది...'

తల్లిమాట గోపాలం మనస్సుని తొలిచివేసింది. పెసరట్టు తింటున్న వాడల్లా అమ్మా అంటూ బావురుమన్నాడు.

'చిన్న పిల్లాడిలా ఏమిటి బాబూయిది.' తల్లి సముదాయించింది గోపాలాన్ని.

'ఇక్కడ నువ్వేమీ నాకు లోటు చెయ్యడంలేదు, హాయిగా వున్నా. కాని అక్కడ మా అమ్మను మా అన్నయ్య సరిగా చూడడంలేదని స్నేహితుడు చెపితే తెలిసింది. చిన్నప్పట్నుంచీ మా అమ్మంటే నాకు వల్లమాలిన ప్రేమ...' గోపాలం చెప్పలేక చెప్పాడు. సీతమ్మగారు కొడుకు పక్కనే కూర్చుంది.

'మా అమ్మను మానాన్న సరిగ్గా చూసేవాడుకాదు. అప్పుడప్పుడు కొట్టేవాడు, తిట్టేవాడు. మా నాన్న ఉన్నంతకాలం ఆవిడ సుఖపడటం నేనెరుగను.మా అన్నదమ్ములిద్దరినీ ఉన్నంతలో లోపం రానీకుండా చక్కగా చూసింది. నేను పెద్దవాణ్ణయి సుఖపెడతానని మా అమ్మ అనుకుంది. జరుగుబాటుకి లోపం వచ్చేసరికి నన్ను దత్తు యిచ్చింది...' చెప్పలేక పోయాడు గోపాలం.

'నాకీ విషయాలు తెలియవు బాబూ...ఇంత కష్టపడిందా మీ అమ్మ!'

'తెలిస్తే నా మీద నీకు అభిమానం తక్కువవుతుందేమోనని సందేహించాను. అందుకే నేనీ విషయం ఎప్పుడూ ఎత్తలేదు...'

'అభిమానం ఒకళ్లు చెపితే వచ్చేదికాదు. అది లోపల్నుంచి పుట్టుకు రావాలి.'

ఇద్దరూ మౌనం వహించారు.

'పోనీ ఒక్కసారి నువ్వు మీ అమ్మగారిని చూసి రాకూడదూ?'

'అదే నేనూ అడగాలనుకున్నా. నిన్నటినుంచీ ఆలోచిస్తున్నా ఎలా అడగాలా అని..'

దీనికింత మొహమాటం ఎందుకు బాబూ, ఇందులో తప్పేముంది? కన్నతల్లిని గుర్తుంచుకోవడం ధర్మం..'

'అయితే రేపే బయలుదేరనా మా వూరికి?'

'వెళ్లిరా బాబూ, మీ అమ్మగారి చేతికి ఏమైనా యిచ్చిరా. అంతమాత్రాన ఆవిడ కష్టాలు తీరేవి కావనుకో...'

'అనవసరంగా నిన్ను సందేహించాను.' అంటూ గోపాలం తల్లికళ్లలోకి చూశాడు.

కొడుకు మనస్సు ఆవిడకి తెలుసు. అయినా కన్నతల్లిని చూసిన తర్వాత అతను ఎక్కడ మారిపోతాడో అనే సందేహం లేకపోలేదు. అదీ ఎలా బయటపెట్టడం!

గోపాలం వాళ్లవూరికి వెడుతుంటే సీతమ్మగారు మరీ మరీ చెప్పింది 'కష్టాలు కొంతవరకు తీర్చవచ్చుగాని, మనోవ్యథను ఎవ్వరూ తీర్చలేరు. దానికసలు మందు లేదంటారు. మీ అమ్మగారి కష్ట సుఖాలు కనుక్కో. మీ అన్నయ్యకు చెప్పిచూడు. అన్ని విషయాలు మాట్లాడి వెంటనే తిరిగి వచ్చెయ్ బాబూ, అక్కడే కూర్చోకు మరి యిక్కడ పొలం పనులు బోలెడు వున్నయ్‌గదా..' తన మనస్సులోని సందేహాన్ని లౌక్యంగా బయట పెట్టాననుకుంది.

అలాగే అని బుర్ర ఊపుతూ గోపాలం వెనక్కి తిరిగి మాటిమాటికి తల్లినీ యింటినీ చూస్తూ స్వగ్రామానికి దారి తీశాడు.

చూడగలిగినంతవరకూ చూసి సీతమ్మగారు లోపలికి వెళ్లడానికి బుద్ధిపుట్టక వీధి అరుగుమీదే కూర్చుండి పోయింది. మనస్సు పరి పరి విధాల పోయింది. కన్న తల్లిని చూసిన తర్వత కొడుకు మనస్సు మారి పోతే, అప్పుడు తానేం చెయ్యాలి!

చివరికి అనుకున్నంతగా జరిగింది.

తల్లినిచూసి వెంటనే తిరిగి వచ్చేద్దామనుకున్న గోపాలం అలా చెయ్యా లేకపోయాడు. 'ఇద్దరు కొడుకులున్నా చివరికి నాఖర్మ యిలా కాలింది' అని కన్నతల్లి అనేసరికి అతని మనస్సు రంపపు కోతకు గురి అయింది. కంట తడిపెట్టడం తప్ప మరేమీ చెయ్యలేకపోయాడు.

ఊళ్లో పెద్దలు రకరకాల సలహాలు చెప్పారు. అన్నీ విన్నాడు గోపాలం. కన్న తల్లిని ఆదుకోలేని నిస్సహాయ స్థితిలో వున్నానని గుర్తించాడు. పెంపుడు

తల్లికి అన్యాయం చెయ్యడం మంచిది కాదనుకున్నాడు. నిజానికి పెంపుడు తల్లని పేరేకాని, ఆవిడ తనను కన్న కొడుకులా ప్రేమించింది. కనకపోయినా ఆవిడ తల్లే! భావసంఘర్షణకు నలిగిపోయాడు. ఒకరోజు సీతమ్మగారు వీధి అరుగు మీద కూర్చుని ఏదో ఆలోచిస్తూ వచ్చే పోయేవారిని వెర్రిగా చూస్తోంది. గోపాలం వెళ్లినప్పటినుంచీ ఆవిడకి అరుగే శరణ్యమయింది.

ఉన్నట్టుండి ఆవిడ చూపు దూరానవస్తున్న కొడుకుమీద పడింది. గోపాలమే! సందేహంలేదు. అతనితోపాటు ఇంకెవరో యిద్దరు ముగ్గురున్నారు. వాళ్లెవరో! గుండెల్లో రాయిపడినట్టయింది. ఆవిడ లోపలికి వెళ్లింది.

అమ్మా అంటూ లోపలికి వచ్చాడు గోపాలం. వెంట వచ్చినవాళ్లూ లోపలికి నడిచారు. వాళ్లని గోపాలం తల్లికి పరిచయం చేశాడు. ఆవిడ మందహాసం చేసి ముభావంగా కూర్చుంది.

వచ్చిన వాళ్లలో ఒక ముసలాయన సీతమ్మగారితో గోపాలం తల్లిని గురించి చెప్పసాగాడు. 'మీకు నేను చెప్ప నవసరం లేదనుకోండి. ఈ పాటికి అన్ని విషయాలు మీరు గ్రహించే వుంటారు' అని ముగించాడు.

'అయితే నన్నేం చెయ్యమంటారిప్పుడు' సీతమ్మగారు సూటిగా అడిగింది, మాటలు నాన్చకుండా.

'మరేం లేదు...గోపాలం పేరున మూడు నాలుగెకరాలు రాస్తే, దానిమీద వచ్చే ఆదాయాన్ని అతను తమ యిష్టం వచ్చినట్టు వాడు కుంటాడు. ఆ సంగతి చెప్పడానికి అతను తటపటాయిస్తున్నాడు...'

'ఇంతేనా, మరేమన్నా చెప్పవలసింది వుందా?'

గోపాలం తల వంచుకున్నాడు. ఆ ముసలాయన ఏదో చెప్పబో తుండగా, 'బాబూ' అంది తల్లి. తల పైకెత్తాడు గోపాలం. 'ఒక్కసారి లోపలికి రా' అంటూ సీతమ్మగారి గదిలోకి వెళ్లింది. అతను దూడలా తల్లిని అనుసరించాడు. ముసలాయన కొంచెం నిర్ఘాంతపోయాడు.

'బాబూ, యిప్పుడు నీ మాటను కాదని నేను మరోలా ప్రవర్తిస్తు న్నానా? నేను నీకేమన్నా లోటు చేశానా? ఆ ముసలాయన ఎందుకిలా

అడిగినట్టు? అడిగే ముందు నిన్ను సంప్రదించాడా...' ఆవిడ ఆత్మాభిమానం దెబ్బతిన్నది.

ఎన్నడూ తల్లి యిలా బాధ పడుతూ తనతో మాట్లాడలేదు. గోపాలం మనస్సు చెరువయింది. కళ్లల్లో నీళ్లు నిలిచాయి. తల్లిని నొప్పించి నందుకు పశ్చాత్తాపం చెందాడు. అమ్మా అంటూ శిరస్సుని ఆవిడ పాదాల మీద వుంచాడు. అతని కన్నీళ్లతో ఆవిడ పాదాలు తడిశాయి.

'బాబూ, నీ మనస్సు ఎలాంటిదో నాకు తెలుసునయ్యా, ఇది నీకు పుట్టిన బుద్ధి కాదు...'

'చెప్పుడు మాటలు విని నిన్ను నొప్పించాను. క్షమించు...' గోపాలం గొంతు బొంగురుపోయింది. 'నువ్వు నాకెలాంటి లోటు చెయ్యలేదన్న సంగతి నాకే కాదు, యీ వూరివాళ్లందరికి తెలుసు. అమ్మా నా మాట నమ్ము....'

గోపాలంతో సీతమ్మగారు ఆ ముసలాయన వద్దకు వచ్చింది. ఆయన తప్పు చేసినవాడిలా ఆవిడ వంక చూశాడు. ఎందుకు వచ్చావమా అనుకున్నారు మిగిలిన వాళ్లు. అప్పుడు సీతమ్మగారు గంభీరంగా యిలా అంది.

'అయ్యా, మీరు పెద్దలు. మూడు నాలుగెకరాలే కాదు. ఈ ఆస్తి అంతా గోపాలానిదే అని యింతకాలం నేననుకున్నా. అలాగే ప్రవర్తించాను. ఇప్పుడు మీ రడిగారు కాబట్టి ఈ పదహారు ఎకరాల మాగాణి గోపాలం పేరుకే రాసిస్తాను మీ అందరి సమక్షంలో. రాత కోతలు నాకు తెలియవు. మీరే మీకు నచ్చినట్టు రాయండి. సంతకం పెట్టేందుకు సిద్దంగా వున్నా...'

అందరూ ఆశ్చర్యపోయారు. రాతి బొమ్మలయ్యారు. ఎవరి ముఖంలోనూ నెత్తురు చుక్క లేదు. మౌనం అలుముకుంది. 'మాఅమ్మ మీది ప్రేమకొద్దీ చెప్పుడు మాటలు విని, నీ మనస్సుని సరిగ్గా తెలుసుకోలేకపోయాను. మా అమ్మా కావాలి. నువ్వూ కావాలి. మీ రిద్దరూ నాకు పూజ్యులే' అని అలుముకున్న మౌనాన్ని ఛేదించాడు గోపాలం.

'ఈ యిల్లు నీది, యీ ఆస్తి నీది...'

'అమ్మా, ఆ మాట అనకు! నువ్వు ఉన్నంతవరకూ అన్నీ నీవే. నీ అభిమానం ఒక్కటే నాకు చాలు. అదే నా ఆస్తి...'

'అయితే బాబూ, ఒక్క షరతు అంది సీతమ్మగారు. అందరూ ఆవిడ వంక చూశారు ఆదుర్దాగా.

'వెంటనే మీ వూరికి వెళ్లి మీ అమ్మ గారిని యిక్కడికి తీసుకురా. ఆవిడ యిక్కడే వుంటుంది.'

'అమ్మా...'